


## మైనార్టీలను మోసగిస్తున్న ప్రభుత్వం

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ముస్లిం మైనార్టీలను మోసగిస్తుందని టిడిపి నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు అనేక మాయమాటలు చెప్పి ముస్లిం మైనార్టీలను కాంగ్రెస్‌పార్టీలోకి అధికంగా తీసుకెళ్ళిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మైనార్టీ సంక్షేమానికి రూ.70కోట్లు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. కానీ ఈ ఆర్థిక సంవత్సరం ఐదునెలలు గడిచినా ఇప్పటికీ మైనార్టీ కార్పోరేషన్‌కు ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి రాష్ట్రప్రభుత్వం మైనార్టీ కార్పోరేషన్లకు నిధులు విడుదల చేయాలని షేక్ జమాల్‌భాషా, కరిముల్లా, మదార్‌సాహెబ్, నరీజరున్నీసాబేగం, ఎస్‌ఎస్.సుభాని తదితరులు డిమాండ్ చేశారు.

## క్లాప్స్‌తో హైస్కూళ్ళ చదువు ఫ్లాప్

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: క్లాప్స్ వల్ల హైస్కూళ్ళలో చదువు ఫ్లాప్ అవుతుందని ఎస్‌టియు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సివిఎస్.మణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వశిక్షాభియాన్ ఇటీవల ప్రవేశపెట్టి స్కూల్ కాంప్లెక్స్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు క్లాప్స్ గుదిబండలాగా తయారైందన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలల్లో సదరు పథకం అమలు తీరుతెన్నులపేరిట నెలలో 10నుండి12రోజులు ప్రధాన బాధ్యత నిర్వహించాల్సిన హైస్కూళ్ళను వదిలి వెళ్ళాల్సి వస్తుందన్నారు.

## ఆస్తికోసం పెదనాన్నపై దాడి

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: ఆస్తి కోసం పెదనాన్నపై దాడిచేసి గాయపరిచిన సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక పురుషోత్తమపట్నంలో నివాసముంటున్న షేక్ గాలీబ్‌సాహెబ్‌కు పిల్లలు లేనికారణంగా అతని భార్య తన చెల్లి కుమారులకు ఆస్థి రాసివ్వమని కోరింది. ఈవిషయంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు పొడసూపాయి. అది మనస్సులో పెట్టుకొని గాలీబ్‌సాహెబ్ భార్య చెల్లెలి కుమారులైన అబ్దుల్‌ఖాదర్, మహ్మద్ మియా, షార్‌గమ్యా, మొహిద్దీన్‌సా, బడేమియా మరియు లెక్చరర్ హుస్సేన్ మియాలు గాలీబ్‌సాహెబ్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితుని ఫిర్యాదుమేరకు ఎస్ఐ కె.వి.నారాయణ శనివారం కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీకాసు వెంగళరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా వందమంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులచే సద్భావనా దినోత్సవాన్ని పాటించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలోని మంచిని ప్రోత్సహించి చెడును విడనాడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జరీనా, టి.పి.శ్రీనివాస్, మురళీదేవి, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

## మదర్‌థెరిస్సా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకున్న చిరంజీవి

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: మహోన్నతవ్యక్తి మదర్‌థెరిస్సా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకున్న చిరంజీవి చేస్తున్న సేవా కార్యక్రమాలను తూ.చ. తప్పకుండా పాటించాలని ఎమ్మార్వో కె.మోహన్‌కుమార్ అన్నారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా చిరంజీవి సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో 90మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆపదలో


రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేస్తున్న ఎమ్మార్వో కె.మోహన్‌కుమార్

ఉన్న వారికి సహాయం చేయడం, అర్థాకలితో అలమటించే వారిని ఆదుకోవడం, పొరుగువారిపట్ల దయ, సానుబూతి కలిగి ఉండటం మానవజాతికి ఉన్న మహోన్నత లక్షణమని అన్నారు. చిరంజీవి ఆశయాలకు అనుగుణంగా సేవాకార్యక్రమాలు చేస్తున్న సొసైటీ అధ్యక్షులు కాసా రామశ్రీనును ఈసందర్భంగా ఆయన అభినందించారు. వైద్యాధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం అని, చిరంజీవి సొసైటీ ద్వారా అనేకమంది క్షతగాత్రులకు సరైన సమయంలో రక్తం అందించి ఈసంస్థ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో విఎఒ రాము, న్యాయవాదులు వెంకట్, ప్రసాద్, కొండెబోయిన ఆంజనేయులు, బత్తినేని శ్రీను, చిరంజీవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజసేవలో ఫొటోగ్రాఫర్లు ఆదర్శనీయులు

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: ఫొటోగ్రఫీ వృత్తిని సమాజసేవలో భాగస్వామిని చేసిన ఫొటోగ్రాఫర్లు ఆదర్శనీయులని ఎమ్మార్వో కె.మోహన్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ స్థానిక వాసవీకళ్యాణ మండపంలో


పేద ఫొటోగ్రాఫర్‌కు రూపాయికాయిన్ బాక్స్ అందజేస్తున్న ఎమ్మార్వో

ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈకార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు బుల్లిబాబు అధ్యక్షత వహించారు. కొన్ని కేసుల్లో చిక్కుముడులను విడదీయడంలో కూడా ఫొటోగ్రఫీ కీలకపాత్ర వహిస్తుందని పట్టణ ఎస్ఐ కె.వి.నారాయణ అన్నారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ విధినిర్వహణలో పోలీసుశాఖకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ తరుపున పేద ఫొటోగ్రాఫర్ సిహెచ్.నరసయ్యకు రూపాయికాయిన్ బాక్సును ఎమ్మార్వో చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి జగదీష్, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, కోశాధికారి సుధాకరరెడ్డి, సీనియర్ ఫొటోగ్రాఫర్ భాస్కరరావు, వి.ఎ.ఒ. రాము, దొడ్డా వెంకట్రావులు పాల్గొన్నారు.

## నీడ్స్‌ను సందర్శించిన ఎమ్మెల్యే మర్రి

చిలకలూరిపేటటౌన్, ఆగస్టు 19 ప్రభాతవార్త: స్థానిక శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ నీడ్స్ సర్వింగ్ సొసైటీని శుక్రవారం రాత్రి సందర్శించారు. అక్కడ ఉన్న హెచ్‌ఐవి, ఎయిడ్స్ బాధితులను పరామర్శించారు. వారికున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ప్రభుత్వానికి సంబంధించి ఆదరణ, ఆలంభన కేంద్రం కోసం ప్రయత్నిస్తామని, ఎయిడ్స్ బాధిత మహిళలకు ప్రభుత్వం నుండి రావాల్సిన సదుపాయాలకోసం కృషిచేస్తానన్నారు. ఈ వ్యాధుల బారిన పడిన పిల్లలకు పునరావాసకేంద్రాలు అవసరమని, వారికి సరైన పౌష్టికాహారంలేక వారి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. చిరుప్రాయంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాధలుగా మిగిలిన పిల్లలు కుటుంబాలను పోషిస్తున్న వైనాన్ని అడిగి తెలుసుకున్నారు. నీడ్స్ చేస్తున్న సేవాకార్యక్రమాలను ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భూషణబాబు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు పావులూరి శివరామయ్య, కృష్ణ



ఎయిడ్స్ బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మర్రి

మోహన్, మస్తాన్‌బి, వెంకట్రావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం

చిలకలూరిపేటరూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త: చిలకలూరిపేట ఏరియా సిపిఐ కార్యదర్శి జి.ఆర్.మోహన్ ఆధ్వర్యంలో పేట మండలం వేలూరు గ్రామంలో శనివారం ఆదర్శ వివాహం జరిగింది. వేలూరు గ్రామానికి చెందిన బొంతా వీరాసేన్ తన తోటివిద్యార్థిని పోలేరమ్మలు ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి పోలేరమ్మ తల్లిదండ్రులు అంగీకరించలేదు. సి.ఆర్.మోహన్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు పోలేరమ్మ తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. అయినా వారు అంగీకరించకపోవడంతో పార్టీ ఆధ్వర్యంలో వేలూరు గ్రామంలో వారిద్దరికీ వివాహం చేశారు.

## ఆ నిబంధన తొలగించాలి

చిలకలూరిపేటరూరల్:గ్రామంలోని వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర పెన్షన్ల దరఖాస్తులపై సర్పంచ్‌లచే సంతకాలు చేయించాలనే నిబంధనను తొలగించాలని జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి ఆర్.అశోక్‌కుమార్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైనవారు సర్పంచ్ సంతకం కోసం వెళ్ళగా రాజకీయంతో వారికి కొన్నిచోట్ల సంతకాలు చేయడంలేదని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల అనవసర రాద్ధాంతాలు పెరుగుతాయని అందువల్ల ఈ ధరఖాస్తులకు సంబంధించి సర్పంచ్‌ల సంతకాలు కాకుండా గ్రామకార్యదర్శులు లేదా మరే ఇతర ప్రభుత్వ అధికారి సంతకం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## శాస్త్రీయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు

నాదెండ్ల(చిలకలూరిపేటటౌన్), ఆగస్టు 19 ప్రభాతవార్త: రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని సీనియర్ శాస్త్రవేత్త ఎస్.పి.మౌల అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో శుక్రవారంరాత్రి ఇ-సాగు వ్యవసాయ సాంకేతిక సేవాకేంద్రం ప్రారంభం సందర్భంగా జరిగిన రైతుసదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో ఎక్కువమంది రైతులు శాస్త్రీయ సాగుపద్ధతులు పాటించకుండా ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల ఆశించిన మేరకు దిగుబడులు పొందలేక తీవ్రనష్టాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో అధికప్రాచుర్యం పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మెరుగైన వ్యవసాయవ్యాప్తి కోసం ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాదు, మీడియా ల్యాబ్ ఆసియాలు సంయుక్తంగా కృషి చేసి ఇ-సాగు విధానాన్ని రూపొందించారన్నారు. ఇ-సాగు చీఫ్ ఎగ్జిక్యూటివ్ సుందర్‌రాజన్ సంపత్ మాట్లాడుతూ మండలంలోని సాయికృష్ణా ఏజెన్సీస్ ద్వారా ఇ-సాగు సేవల్ని గ్రామాల్లోని రైతులందరూ విస్తృతంగా పొందవచ్చన్నారు. ఒక్కొక్క సీజన్‌కు ఎకరానికి రూ.300లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బైర్రాజు ఫౌండేషన్, జనని ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఇ-సాగులో భాగస్వాములని తెలిపారు.

కార్యక్రమంలో నాదెండ్ల రైతు నల్లమోతు సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయాధికారుల ద్వారా రైతులకు ఉచితంగా వ్యవసాయంలో మెళుకువలు నేర్పాల్సిందిపోయి ప్రభుత్వం బాధ్యతలనుండి తప్పుకొనేందుకు ఇ-సాగు కేంద్రాలకు మద్దతునిచ్చి ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ఈకార్యక్రమంలో భూపతి భాస్కరరావు అధ్యక్షతవహించగా ఇ-సాగు మేనేజర్ శ్రీనివాస్, శివశంకర్‌రెడ్డి, సతీష్‌బాబు, గంగవరపు కృష్ణమూర్తి గ్రామసర్పంచ్ నల్లమోతు వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.




## ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలి

మంగళగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:మంగళగిరి పురపాలకసంఘం పరిధిలోని కొప్పరావూరు కాలనీనందు శనివారం పచ్చదనం-పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు ఎం.హనుమంతురావు చైర్మన్ కె.


మొక్కలునాటుతున్న ఎమ్మెల్యే హనుమంతరావు

శ్రీనివాసరావు, కమిషనర్ కె.లక్ష్మినారాయణ వార్డు మెంబర్లు వి.రాజేంద్రప్రసాద్, కె.లక్ష్మణరావు, ఎంపిపి డి.నాగేశ్వరరావు, ఆర్.వి.దత్తు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో శాసనసభ్యులు మురుగుడు హనుమంతరావు ప్రసంగిస్తూ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఎర్పడుతుందని, మానసిక ఉల్లాసంగా ఉంటుందని తెలిపారు. మొక్కలు పెంచుకోదలచిన వారు పురపాలక సంఘం నందు మొక్కలు ఉచితంగా తీసుకొని ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలాల్లో పెంచవలసినదిగా ప్రజలకు ఆయన కోరారు.

## ఆదరణ సంస్థచే విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మంగళగిరి, ఆగస్టు 17 ప్రభాతవార్త: చింత క్రింది కనకయ్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కీర్తి శేషులు చింత క్రింది కనకయ్య దారి 56వ వర్థంతి సందర్భంగా శనివారం సికెకాలేజి ఆడిటోరియంలో 300మంది విద్యార్థినీ విద్యార్థులకునోట్ బుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి.రామ్మోహనరావు ఆది సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి వై.చంద్రమోహన్ పాల్గొన్నారు.

## ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ నేడు

మంగళగిరి, ఆగస్టు 17ప్రభాతవార్త:స్థానిక అంజుమన్ ఇ-హిమాహితుల్ ఇస్లాం కార్యాలయ ఆవరణంలో ఈనెల 20వ తేదీన పేద ముస్లిం విద్యార్థిని, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేయడం జరుగుతుందని అంజుమన్ కార్యదర్శి షేక్ అక్రం తెలిపారు. సుమారు 26 మంది ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.100 నుండి500 ల వరకు పంపిణీ జరుగుతుందన్నారు.

## నిందితుడి అరెస్టు

తాడేపల్లి, ఆగస్టు 19ప్రభాతవార్త : తాడేపల్లి బైపాస్‌లోని కనకదుర్గమ్మ వారధి సమీపంలో ఈనెల 16వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన నిందితుడిని తాడేపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కొలనుకొండలో గల శర్వాణి రెడీమిక్స్‌కు చెందిన వాహనము ఈనెల 16వ తేదీన కనకదుర్గమ్మ వారధి వద్ద ఒక కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వై.శ్రీనివాసరావు, నాగమణిలకు తీవ్రగాయాలయ్యాయి. వీరు విజయవాడలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొంది తున్నారు. వై. శ్రీనివాసరావు మామ అయిన శెట్టి హనుమంతరావు ఈ సంఘటనకు సంబంధించి శుక్రవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినవిషయం తెలిసిందే. ఈ నేపధ్యంలో తాడేపల్లి పోలీసులు శనివారం శర్వాణి రెడీమిక్స్ వాహన డ్రైవర్ బురదగుంట మణిరాజును అరెస్టు చేశారు. నిందితుడు వడ్డేశ్వరం గ్రామ ప్రాంత వాసి.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లి, ఆగస్టు 19ప్రభాతవార్త: తాడేపల్లి బైపాస్ వద్ద శుక్రవారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తాడేపల్లి పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లి బైపాస్ పక్కన గల హైవే టవర్స్ సమీపంలో రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని వెనుక నుండి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 45 సం.లు ఉండవచ్చు. బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్, లైట్ బ్లూ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు. ఇతని ఆచూకీతెలిసిన వారు ఎవరైనా తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తాడేపల్లి ఎస్.ఐ. ఎస్.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.